క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

రొంపిచెర్ల/పులిచెర్ల(కల్లూరు): రాబోవు ఎన్నికలల్లో ఓటర్లకు పూర్తి రక్షణ కల్పిస్తామని, నిర్భయంగా ఓటు వేయాలని కల్లూరు సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పులిచెర్ల మండలం కల్లూరులో, రొంపిచెర్ల మండల కేంద్రంతోపాటు బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలలో కేంద్ర బలగాలతో ఆయన కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ధైర్యం కల్పించడానికి కవాతు చేశామని అన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలను రెచ్చగొట్టేలా ప్రచారం చేయరాదన్నారు. ర్యాలీలు, మైకులకు, రోడ్‌షోలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సుకుమార్, రవిప్రకాష్‌రెడ్డి, ఏఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు కల్లూరు లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ ప్రకాష్ బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం శ్రీవాణి, పీఈటీలు రాజశేఖర్, విమలా విక్టోరియా, జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ, ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, రాజేంద్ర, స్నేహమాలిని తదితరులు పాల్గొన్నారు.

పైపులైను ఏర్పాటుతో తీరిన దాహార్తి



పైపులైను పనులను పరిశీలిస్తున్న మండీ సుధా, కౌన్సిలర్ రాజేష్

పలమనేరు: పట్టణ సమీపంలోని ఎంబీస్ కాలనీ దాహార్తి సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పరిష్కరించారు. పంపుహౌస్ నుంచి పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైను నుంచి కాలనీలోకి పైపులైనును బుధవారం ఏర్పాటు చేశారు. దీంతో ఈ కాలనీలో ఇకపై మంచినీటి సమస్య తలెత్తదని పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా తెలిపారు. తమ కాలనీకి నీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఆ వార్డు కౌన్సిలర్ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

స్థల పరిశీలన



ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న చైర్మన్, ఈఓ తదితరులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. బోయకొండలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

అయ్యో పాపం!



పోలీసుల అదుపులోని వ్యక్తి

చౌడేపల్లె: అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని గ్రామస్తులు చితకబాదిన సంఘటన గోనలకురప్పల్లె బీసీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గుర్తు తెలియని వ్యక్తి ఇళ్ల మధ్య సంచరిస్తున్నట్టు గుర్తించి కొందరు అతని వద్దకెళ్లి ప్రశ్నించారు. అతడు మూగవాడిలా సైగలు చేయడంతో చోరీకి వచ్చినట్టు అనుమానించి చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడు నిజంగానే మూగవాడని, చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ జీవిస్తున్నట్టు తెలుసుకున్నారు. ఆపై అతడిని ఆస్పత్రికి తరలించారు.

హరిత విద్యార్థులకు సన్మానం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ హరిత విద్యార్థులను హెచ్‌ఎం శ్రీవాణి సన్మానించి పతకాలు అందజేశారు. నేషనల్ గ్రీన్‌కోర్ కార్యక్రమంలో పాఠశాలలో గ్రీన్‌మాస్టర్ వెంకటసిద్దులు, కన్వీనర్ రాజేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటిని సంరక్షించి, స్కూలును అందంగా తీర్చిదిద్దారు. దీనికి కృషి చేసిన విద్యార్థులు భాస్కర్, నందకుమార్, లోకేష్, నందకిషోర్‌లను సన్మానించారు.

వైఎస్సార్ సీపీతోనే మైనారిటీల అభ్యున్నతి

- మైనారిటీ మహిళలకు ప్రత్యేకంగా కళాశాల ఏర్పాటుకు కృషి
- ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ



హాజరైన ముస్లింలు



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ



ఇళ్లపట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే, ఎంపీ, నాయకులు

వి.కోట: మైనారిటీల అభ్యున్నతి, ప్రత్యేక రిజర్వేషన్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం పట్టణంలో ముస్లింలకు ఎంపీ, ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. వారి ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనారిటీలకు సముచితస్థానం కల్పించిందన్నారు. జగనన్న మాట ఇస్తే చేతల్లో చేసి చూపిస్తారన్నారు. చంద్రబాబు నాయుడు తన పాలనలో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, ఏ ప్రభుత్వమూ చేయని విధంగా విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం పక్షపాతిగా నిలిచిందన్నారు. మండలంలో మైనారిటీలకు షాదీమహల్ పూర్తి చేయడంతోపాటు మైనారిటీలకు సంబంధించి ప్రత్యేకంగా మహిళా కళాశాలను ప్రభుత్వంతో చర్చించి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

మీకు మంచి చేసిఉంటేనే పార్టీని గెలిపించండి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకు మేలు జరిగి ఉంటేనే పార్టీకి మరోసారి పట్టం కట్టాలని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనతో అభివృద్ధి బేరీజు వేసుకోవాలని కోరారు. ఒక్కో కుటుంబానికి జగనన్న ఎన్ని లక్షల వరకు లబ్ధి చేకూర్చారో గుర్తించాకే ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాబలం లేకనే పార్టీలు జతకట్టుకుని వస్తున్న టీడీపీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన ఇంటి పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పీఎస్ నాగరాజు, ఎస్‌ఏ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, ఉప సర్పంచ్ అక్మల్, సేట్, నాయకులు అబ్బూఖాన్, సయ్యద్ షామీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని మొరసపల్లెలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామీణ వైద్యశాల, ఆధునీకరించిన గ్రామ సచివాయ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వ సేవలను గ్రామాల ముంగిటకే చేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నం గౌడు, డైరెక్టర్ వరదరాజులు, జిల్లా పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అశ్వత్‌బాబు, నాయకులు జానకిరాం, మణి, బాబు, కొండన్న, బసవరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం రూరల్: కుప్పం మండలం బొగ్గుపల్లెకు చెందిన అనితకు ఇటీవల గర్భసంచి ఆపరేషన్ చేశారు. నిరుపేదరాలైన అనిత సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం రూ.1.5 లక్షలు మంజూరు చేయడంతో బుధవారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, అనిత దంపతులకు ఆ సొమ్ము తాలూకు చెక్కును అందజేశారు. నాయకులు మురుగేష్, నగేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



రాజగోపుర నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మూడంతస్తుల రాజగోపుర నిర్మాణానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ భూమిపూజ

పలమనేరు: ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో రూ.1.23కోట్లతో మూడు అంతస్థుల రాజగోపుర నిర్మాణ పనులకు బుధవారం ఆలయ కమిటీ, నాయకులతో కలసి ఆయన భూమి పూజ చేశారు. అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం దేవాలయాలను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో ఎన్నో ఆలయాలను సర్వాంగసుందరంగా నిర్మించారన్నారు. ఇక్కడి శివాలయంలో రాజగోపుర నిర్మాణం పట్టణవాసులు దశాబ్దాల కల అని, దీనిని సాకారం చేసినందుకు పట్టణ ప్రజల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ చైర్మన్ వీరభద్ర, కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, హరీష్‌నాయుడు, పురుషోత్తం, శ్రీనివాసులు, మల్లికార్జున, మునెప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ కమలాకర్, సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లు శ్యామ్, రాజేష్, నాగరాజు, రమేష్‌రెడ్డి, హేమంత్, కుమార్, శశి, సోము పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శివప్రసాద్



చౌడేపల్లె: ఎంపీడీఓగా కేవీ శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నాయుడుపేట నుంచి ఎన్నికల బదిలీలో భాగంగా తొలుత కేవీబీ పురానికి అక్కడ నుంచి మళ్లీ బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. గతంలో వైఎస్సార్ జిల్లా పులివెందుల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన డాక్టర్ వెంకటేశు ఐరాలకు బదిలీ అయ్యారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని శివప్రసాద్ చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

శాంతిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.మైథిలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిమ్మనపల్లె మండలం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎస్ రాధాకృష్ణ రామకుప్పం మండల ఈవో పీఆర్డీగా బదిలీ అయ్యారు. ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల పరిషత్ సిబ్బంది మైథిలికి స్వాగతం పలికారు.

అగ్నికి యూకలిప్టస్ చెట్లు ఆహుతి

చౌడేపల్లె: మండలంలోని చెడుగుట్లపల్లెకు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చింతచెట్ల తోపునకు నిప్పు పెట్టడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ఘటనలో సుమారు రూ:30 వేల విలువచేసే యూకలిప్టస్ చెట్లు (తైలం చెట్లు) అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను గుర్తించి స్థానికులు సమాచారమివ్వడంతో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. రెవెన్యూ అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు ఉగాది పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉగాది పండుగ పురస్కరించుకుని తెలుగు సంవత్సరాది గొప్పదనం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి తులసీనాథం నాయుడు, కళామందిరం, గంగవరం, పలమనేరు చిరునామాకు తపాలాలో ఈ నెల 30వ తేదీ లోపు పంపాలని చెప్పారు. బాగా రాసిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు.

కెనమాకులపల్లె పంచాయతీకి రూ. 22 లక్షల ఆదాయం



శాంతిపురం: వేలం నిర్వహిస్తున్న అధికారులు

శాంతిపురం: బడుగుమాకులపల్లె వారపు సంతకు బుధవారం నిర్వహించిన వేలంలో కెనమాకులపల్లె పంచాయతీకి రూ.22లక్షల ఆదాయం లభించిందని సర్పంచ్ ఏవీ జయరాం తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్, ఈఓపీఆర్డీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనారాయణ మార్కెట్ల వేలం నిర్వహించారు. ఎద్దులు, ఆవుల గేటు వసూలుకు రూ 8.71 లక్షలు, ప్రైవేటు వాహనాల గేటుకు రూ.4.99 లక్షలు, గొర్రెల గేటుకు రూ.4.60 లక్షలు, దుకాణాల గేటు వసూలు హక్కులను రూ. 3.70 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీటీసీ రాజప్ప, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు నిసార్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, అప్పిరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.29.96 లక్షలు ఆదాయం

పుంగనూరు: మున్సిపాలిటీ వేలం పాటల్లో రూ.29.96 లక్షలు ఆదాయం లభించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీ వారపుసంతకు రూ.8.52 లక్షలు, కూరగాయల మార్కెట్‌కు రూ.8.53 లక్షలు, ప్రైవేటు బస్టాండ్ రూ.7.01 లక్షలు, మరుగుదొడ్లు రూ.5.90 లక్షలు, ప్రజా మరుగుదొడ్లు రూ.55 వేలకు వేలం పాటలలో పాటదారులు దక్కించుకున్నారన్నారు. వేలం ఆదాయాన్ని మున్సిపల్ ఖాతాకు జమ చేసినట్లు చెప్పారు.

ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ



పుంగనూరు : భగత్‌సింగ్ కాలనీలో..



పలమనేరు : గంటావూరులో..

పుంగనూరు: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. ఓటర్ల నమోదుపై బుధవారం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో మహిళలతో కమిషనర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా నిర్భయంగా ఓటరుగా నమోదై, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిటీ మిషన్ కో-ఆర్డినేటర్ మధుసూదనరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: ఓటు హక్కు వినియోగంపై బుధవారం మున్సిపాలిటీలోని గంటావూరులో మెప్మా అధికారులు, సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వీప్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్లకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పట్టణ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యానికి పెద్దపీట వేసింది జగనన్నే

పలమనేరు: గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైద్యానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మండీసుధా అన్నారు. బుధవారం పట్టణంలోని 23, 24, 25, 26 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష-2 నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యసేవలు, ఆస్పత్రుల అభివృద్ధి, కష్టం వస్తే ఆదుకునే 108, 104, జబ్బుపడితే ఆరోగ్యశ్రీలో రూ.25లక్షల దాకా వైద్యఖర్చు..ఇలా పేదల వైద్యం కోసం సీఎం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చెర్మన్ రహీంఖాన్, సచివాలయాల అధ్యక్షులు కోదండరామయ్య, కౌన్సిలర్లు శ్యామ్, హేమంత్, పలువురు వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' విగ్రహం ఏర్పాటుకు అనుమతించరూ!



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రెడ్డి సంఘం నేతలు

రామకుప్పం: స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సంఘం నేతలు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ దిలీప్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ సభ్యుడు పేర్కొన్నారు.

నేడు ఆర్బీకే, సచివాలయ భవనాల ప్రారంభం



మేలుందొడ్డిలో భవనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

పుంగనూరు: మండలంలోని మేలుందొడ్డిలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను గురువారం మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. బుధవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు కోటి రూపాయలతో నిర్మించారని ఆయన చెప్పారు. అలాగే పట్టణంలో రూ.25 లక్షలతో నిర్మించిన షాదీమహల్‌ను కూడా మంత్రి ప్రారంభిస్తారు. మంత్రి తొలుత హనుమంతరాయునిదిన్నెలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

సదుం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే ధ్యేయంగా చదవాలని రిటైర్డ్ హెచ్‌ఎం, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో సరస్వతీ పూజ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేందుకు లయన్స్‌క్లబ్ ప్రతినిధి రాజారెడ్డి హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డికి రూ. 5 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీరాములు, దామోదర, పాలమంద సర్పంచ్ మనోహర్‌రెడ్డి, మాజీ హెచ్‌ఎం ఫజురుల్లా, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు శంకర పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: గ్రామాలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలనే వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ వరలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక శ్రీ శక్తి భవనంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని, వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపి, ఈఓపిఆర్‌డి శంకర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



ప్యాడ్లు అందుకున్న విద్యార్థులతో నాయకులు

పలమనేరు: పట్టణంలోని 19వ వార్డు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే అందజేసిన రైటింగ్ ప్యాడ్లు, పెన్నులను ఆ వార్డు కౌన్సిలర్ రాజేష్ బుధవారం పంపిణీ చేశారు. పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా అలీ అక్బర్



చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా గంగాధరనెల్లూరు మండలం అబ్బాస్ నగర్‌కు చెందిన అలీఅక్బర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు అప్పజెప్పిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అలీ అక్బర్ చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ముస్లిం నాయకులు ఆయన్ను అభినందించారు.

